క్లుప్తంగా

గుంత పూడ్చరూ..



ప్రమాదకరంగా ఉన్న గుంత

ఉంగుటూరు: కైకరం తోటబడి సమీపంలో తవ్విన గుంత నెలలు గడుస్తున్నా పూడ్చడం లేదు. దీంతో ఆ రహదారి మీదుగా వెళ్లే వారికి ప్రమాదపు గుంతగా మారింది. కై కరం వంతెనపై నుంచి పడమర వీధులకు వెళ్లడానికి ప్రధానమైన రహదారి వెంబడి గుంతను తవ్వారు. పైపులైన్ మరమ్మతుల కోసం తవ్విన ఈ గుంతను పూడ్చకుండా పంచాయతీ వారు అలాగే వదిలేశారు. ఈ రహదారిల విద్యార్థులు, చిన్నారులు తిరుగుతున్నారు. ద్విచక్ర వాహనాలు ఎక్కువగా తిరుగుతున్నాయి. ప్రమాదపు అంచున తిరుగుతున్నట్లు ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: ఈ నెల 5వ తేదీన నల్లమాడు సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. కావున పందిరెడ్డిగూడెం డొమెస్టిక్ ఫీడర్, నల్లమడు, ఎర్రమిల్లిపాడు, కంసాలిగుంట గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న అధికారి కరణ్

దెండులూరు: రైతులు సాగులో అభివృద్ధి సంతృప్తికరమైన దిగుబడులు భూసార పరిరక్షణ కోసం వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారి కరణ్ అన్నారు. బుధవారం జోగన్నపాలెం, దెండులూరు గ్రామాల్లో దెండులూరు మండలం వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు అధ్యక్షతన పొలంపిలుస్తోంది కార్యక్రమంనిర్వహించారు. రైతులకు సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, భూసార పరిరక్షణ, ఎరువులు, పురుగు మందుల వాడకం మోతాదు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు.

భారీ లోడు వాహనాలకు చెక్



నాచుగుంట బ్రిడ్జి వద్ద గడ్డర్లు ఏర్పాటు చేస్తున్న టోల్‌ప్లాజా సిబ్బంది

ఉంగుటూరు: టోలు ఎగువేతదారులకు చెక్ పెట్టారు. నాచుగుంట మీద నుంచి ఉంగుటూరు ఊరిలో వంతెన మీదుగా జాతీయ రహదారి మీదకు చేరుకునే లోడు లారీలు ఇక నుంచి వెళ్లకుండా గడ్డర్లు టోలు ప్లాజా సిబ్బంది ఏర్పాటు చేశారు. టోలు ఎగవేత దార్లు చిన్నకార్లు మెదలుకుని భారీ లారీలు లోడు వాహనాలు టోలు తప్పించుకుని నాచుగుంట బ్రిడ్జి ,ఉంగుటూరు బ్రిడ్జి మీద నుంచి తిరుగుతున్నాయి. దీని వలన ఉంగుటూరు ఊరిలో రహదారి తరుచూ మరమ్మతులకు గురవుతుంది. ఉంగుటూరు, నాచుగుంట బ్రిడ్జిల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో బ్రిడ్జిలు దెబ్బతింటున్నాయి. ఫలితంగా జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై హైవే అధికారులకు సూచనలు చేయడంతో గడ్డర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది.

హెల్మెట్ ధారణ.. ప్రాణ రక్షణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

దెండులూరు: హెల్మెట్ ధరించడం వలన ప్రమాదంలో ప్రాణ రక్షణ కలుగుతుందని సీఐ రాజశేఖర్, ఎస్సై ఆర్.శివాజీ అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు సోమవరప్పాడు బైపాస్ వద్ద ఎస్సై శివాజీ ఆధ్వర్యంలో హెల్మెట్లు లేని ద్విచక్ర వాహనాల రికార్డులు, లైసెన్సులు తనిఖీ నిర్వహించారు. వాహనాల తనిఖీ నిర్వహించిన సమయంలో ఒక్క ద్విచక్ర వాహనదారుడికీ హెల్మెట్ లేకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ సెల్ ఫోన్‌కు వేయి రూపాయలతో స్క్రీన్ గార్డ్ ఏర్పాటు చేస్తున్న యువత మనిషికి రక్షణగా రూ.500ల హెల్మెట్ కొనకపోవడం ధరించకపోవడం సరైనది కాదన్నారు. హెల్మెట్ లేకపోతే జరిగే అనర్థాలను సీఐ ద్విచక్ర వాహనదారులకు వివరించారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అడుగుకో గుంత.. ప్రయాణం చింత

- పూడ్చిన ఐదు నెలలకే గుంతలు
- ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికుల అవస్థలు
- గ్రామీణ రహదారులు అధ్వానం



భీమడోలు సంత మార్కెట్ నుంచి జంక్షన్ వరకు మరమ్మతులు చేసిన రోడ్డు దుస్థితి



పోలసానిపల్లి గురుకుల కళాశాల శివారు అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి



భీమడోలు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే దారిలో నిలిచిన వర్షపు నీరు

భీమడోలు: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రధాన రహదారులను అద్దంలా మారుస్తాని ప్రకటనలు చేసిన పాలకులు గుంతలను పూడ్చి సరిపెట్టారు. మరిన్ని రోడ్లను పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో అధికారులు, పాలకుల పని తీరుకు నిలువెత్తు సాక్ష్యంగా మారాయి. తీరా ఐదు నెలలకే ఆ రోడ్లపై భారీ గుంతలు ఏర్పడి అధ్వానంగా మారాయి. దీంతో చిన్నపాటి వర్షానికి సైతం రోడ్లు అధ్వానంగా మారి అడుగుకో గుంత గజానికో గొయ్యి అన్న చందంగా మారింది. దీంతో ద్విచక్ర వాహదారుల పాలిట శాపంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ఒళ్లు హూనమవుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు చిన్నపాటి వర్షానికే నీరు నిలుస్తోంది. మండల వ్యాప్తంగా ప్రధాన రహదారులు గుంతలుగా మారింది. అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా రోడ్లు నిలిచాయి. భీమడోలు సంతమార్కెట్ నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో నిండిపోవడంతో ప్రజలు, భక్తులు, యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడడంతో గుంతల్లో చేరిన నీటి వలన వాటిని అంచనా వేయలేక ద్విచక్ర వాహనదారులు ఆ గుంతల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణం క్షణం క్షణం భయపడాల్సి వస్తుందని వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు.

మరమ్మతులు చేసిన 5 నెలలకే పాడైన వైనం

ఈ రహదారిని ఐదు నెలల కితం లక్షలాది రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేసి, గుంతలను పూడ్చారు. గుంతలను పూడ్చే తరుణంలో అధికారుల సమన్వయం లేకపోవడంతో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చారు. దీంతో పనుల్లో డొల్లతనం ఐదు నెలలకే కనిపించింది. పోలసానిపల్లి నుంచి ద్వారకాతిరుమల వెళ్లే రాష్ట్రీయ రోడ్డులో గురుకుల పాఠశాల దాటిన తరువాత రోడ్డు గుంతలు పడి వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. గుండుగొలను నుంచి భోగాపురం వరకు వెళ్లే రహదారి ఛిద్రమైంది. రైతులు, ప్రజలు రాకపోకలు సాగించాలంటేనే భయపడిపోతున్నారు. భీమడోలు వంతెన నుంచి పెదలింగంపాడుకు వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. భీమడోలు రాజుల వీధిలోని రోడ్డు గుంతలు పడ్డాయి. ఇలా ప్రతి గ్రామంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి.

అప్రోచ్ రోడ్లు పాడైన వైనం

గుండుగొలను టూ రాజమండ్రి జాతీయ రహదారిపై నుంచి అప్రోచ్ రోడ్డు మీదుగా పోలసానిపల్లికి వచ్చే దారిలో రోడ్డు అంచు అండలు జారి పోవడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం పొంచి జరుగుతుందోనని భయంతో వాహనదారులు వణికిపోతున్నారు. దీంతో వారు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. మండల పరిధిలోని భీమడోలు జంక్షన్ నుంచి పోలసానిపల్లి శివారు వరకు ఐదు కిలోమీటర్ల దూరంలో గుంతలతో నిండాయి. ప్రజల నిత్య జీవితంలో రోడ్డుకు ఉన్న ప్రాధాన్యత ఎంత చెప్పినా తక్కువేనని చెప్పాలి. రోడ్ల సమస్య ప్రజా భద్రతకు, ఆరోగ్యానికి ముంపుగా మారుతుంది. కనీసం రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ, మండల పరిషత్ అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు. భీమడోలు ఆర్అండ్‌బీ ఏఈ జె.భాస్కరరావు వివరణ కోరగా ఆర్అండ్‌బీ రోడ్డుపై గుంతలు ఏర్పడానికి డ్రెయినేజీ లేకపోవడమేనన్నారు. నిధులు మంజూరు కాగానే గుంతలు పూడ్చేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

రోగ్యమాత నవదిన పూజ



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

దెండులూరు: వేగవరం ఆర్‌సీఎం టవర్ వద్ద వేలంగిణి ఆరోగ్యమాత నవదిన పూజ స్థానిక ప్యారిస్ ప్రీస్ట్ ఫాదర్ ఎల్.మోజస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్‌సీఎం ఏలూరు పీఠం ఫాదర్ రాజు, ఫాదర్ మోజస్ దివ్యపూజ బలి అర్పించారు. అనంతరం ఫాదర్ రాజు వేలంగిణి మాతకు చీర సమర్పణ గజమాల హారతి అర్పణ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

దెండులూరు: గోపన్నపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి గ్రామానికి చెందిన కోలా గోవర్ధన్ సతీమణి కనక మహాలక్ష్మి రూ.10,116 బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. దాతల కుటుంబానికి కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.

గణనాథునికి ప్రత్యేక అలంకరణ



భీమడోలు: స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



దెండులూరు: లడ్డూ దక్కించుకున్న భక్తులు

భీమడోలు: మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాల్లో బుధవారం గణనాధుని ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. లంబోదరుని ట్రాక్టర్లపై ఉంచి తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో డీజే సౌండ్స్‌లో యువకులు నృత్యాలు చేస్తూ బాణసంచా కాల్చుతూ వినాయకుని విగ్రహాలను ఊరేగించారు. భీమడోలులోని గణపతి సెంటర్‌లోని శ్రీమన్మహా గణనాధుని 61వ ఉత్సవాల్లో 8వ రోజు స్వామి వారు భక్తులకు సంప్రదాయ కాషాయ వర్ణంలో దర్శనమిచ్చారు. భీమడోలు పాలకేంద్రం వద్ద నిర్వాహకులు యర్రంశెట్టి శివ, వెజ్జు శ్రీమన్నారాయణల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

లక్కీ డ్రాలో 15 కేజీల లడ్డూ

దెండులూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా దెండులూరు కాపుల వీధిలో విఘ్నేశ్వరుని మండపంలో స్వామి వారి లడ్డూకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో ఆలయ కమిటీ లక్కీ డ్రా ఏర్పాటు చేశారు. డ్రాలో గ్రామానికి చెందిన భక్తులు మానేపల్లి బుజ్జి, పద్మ దంపతులకు 15 కేజీల స్వామి వారి లడ్డూను గెలుపొందారు.

అన్న సమారాధనలు

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామంలో సంత బజారు వినాయకుని ఆలయం వద్ద, సెంటర్‌లో ఆటో వర్కర్స్ యూనియన్ వినాయకుని మండపం వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు భోజనాలు చేశారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలకు గ్రామ ప్రజలు సహకరించారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు వేతనాలు అందజేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: కాగుపాడు హైస్కూలు విద్యార్థులకు రూ.50 వేల విలువ గల ఉపకార వేతనాలు బుధవారం అందజేవారు. ప్రవాసాంధ్రులు సుంకవల్లి గోపెమ్మ రాజగోపాలరావు మెరిట్ అవార్డ్స్ పేరుతో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే మెరిట్ విద్యార్థులకు చేబ్రోలు కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కడియాల రవి శంకర్, బాలగోపాలస్వామి ట్రస్ట్ బోర్డు చైర్మన్ కడియాల రంగరావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. పాఠశాలకు కంప్యూటర్, అన్ని తరగతి గదులకు ఇంటర్ నెట్ సౌకర్యం నిమిత్తం మరో రూ.50 వేలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, పేరంట్స్ కమిటీ చైర్మన్ కర్రి బాలకృష్ణ, వైస్ చైర్మన్ కడియాల రత్నాజి, ఉపాధ్యాయులు శీతాల సత్యనారాయణ, వెలిచర్ల శ్రీనివాస్, గుదే శ్రీనివాసరావు, రవి శంకర్, శ్రీనివాసరావు, వల్లీ తల్లితండ్రులు పాల్గొన్నారు.

భూ సేకరణ పరిహార సమస్య పరిష్కారం



పరిహారం చెక్‌ను అందజేస్తున్న జిల్లా ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి తదితరులు

భీమడోలు: ఏలూరులోని లోక్ ఆదాలత్ కోర్టులో బుధవారం మండలంలోని పూళ్లలో భూ సేకరణ నష్ట పరిహారంపై ఏర్పడిన వివాదం పరిష్కారమైంది. ఫిర్యాదుదారుని వట్టి పద్మావతికి రూ.3 లక్షల నగదు చెక్‌ను అందించారు. దీంతో నాలుగు దశాబ్దాలుగా ఉన్న భూసేకరణ పరిహారంపై ఏర్పడిన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఏలూరు జిల్లా ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి కేకేవీబీ కృష్ణ ఈ కేసు లోక్ ఆదాలత్‌లో సెటిల్‌మెంట్ చేశారు. 1985లో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలను అందించేందుకు గ్రామానికి చెందిన వట్టి పద్మావతికి చెందిన పూళ్ల రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 422/1ఏ లోని 4.09 ఎకరాల భూమిని సేకరించింది. అప్పట్లో ప్రభుత్వం ఎకరాకు రూ.48 వేల పరిహారం అందించింది. అయితే పరిహారంపై అసంతృప్తితో 1987లో ఆమె సీనియర్ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అప్పటి నుంచి కోర్టులో ఈ కేసు సాగుతుంది. అయితే ఇటీవల జిల్లా ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి, కలెక్టర్, ఆర్‌డీవోల సూచనల మేరకు సెటిల్‌మెంట్ చేశారు. ఈ కేసును ప్రభుత్వ ప్లీడర్ బి.జగన్నాథరెడ్డి వాదించారు. ఎకరాకు రూ.58200 చొప్పున సెటిల్‌మెంట్ చేశారు. దీంతో 4.09 ఎకరాల భూమికి రూ.7,42,218లకు సెటిల్‌మెంట్ చేశారు. గతంలో చెల్లించిన రూ.4,42,218లకు పోను మిగిలిన రూ.3 లక్షల చెక్‌ను భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి సమక్షంలో జిల్లా ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి కేకేవీబీ కృష్ణ ఆమెకు అందించారు.

పారదర్శకంగా ఉపాధి పనులు



ఉద్యోగులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో రాజ్‌మనోజు

ఉంగుటూరు: ఉపాధి కూలీలు ఇకనుంచి దొంగ హాజరు వేయడం కుదరదని ఎంపీడీవో రాజ్‌మనోజు అన్నారు. బుధవారం ఉంగుటూరు ఎంపీడీవో ఆఫీసులో ఉపాధి హామీ ఉద్యోగులు ఫీల్డ్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పనికి ముందు, తరువాత ఫొటో తప్పనిసరిగా తీయాల్సి ఉందని, లేకపోతే డబ్బులు పడవని స్పష్టం చేశారు. ఇళ్లు నిర్మించుకునే వారికి 90 రోజుల ఉపాధి చూపాల్సి ఉందని ఫలితంగా రూ.27 వేలు లబ్ధి పొందుతారని తెలిపారు. గత ఏడాది ఉపాధి పనుల్లో తేడాలు గమనించి రికవరీకి రాసిన సొమ్ములు రూ.2 లక్షల 60 వేలు ఉపాధి ఫీల్డ్ సహాయకులు ప్రభుత్వానికి తిరిగి చెల్లించాలని సూచించారు. సమావేశంలో ఉపాధి ఏపీవో వెంకట రమణ, ఇంజనీరింగ్ సహాయకుడు పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

పెదపాడు: ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శిరీష, ప్రతినిధులు తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు సీఆర్ఆర్ మహిళా కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందే విధానంపై అవగాహన కల్పించారు. కలుషిత రక్త మార్పిడి, సిరంజిల ద్వారా, ఎయిడ్స్ ఉన్న తల్లి ద్వారా బిడ్డకు వ్యాప్తి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ఎయిడ్స్ నియంత్రణ విభాగం మేనేజర్ వి.రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులు

గణపవరం: విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య కీలకమని, ఇంటర్‌లోనే విద్యార్థి జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, లక్ష్య సాధనకు శ్రమిస్తే ఫలితం దక్కుతుందని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస గౌడ్ అన్నారు. బుధవారం కాలేజీలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సీనియర్ తెలుగు అధ్యాపకులు నాగేశ్వరశర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కలుపు మందు వాడితే పంట మాడిపోయింది



వీఏఏకు ఫిర్యాదు చేస్తున్న రైతు అంజిబాబు

భీమడోలు: చేనులోని కలుపు నివారణ కోసం వాడిన మందు పంటను తీవ్రంగా నష్టం చేసిందని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పచ్చని వర్ణంలో ఉండాల్సిన పంట మాడిపోతుందని, ఆ కంపెనీ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ కురెళ్లగూడెం వీఏఏ భార్గవీకి బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. అనంతరం ఏవో ఉషారాణి దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లాడు. అంబర్‌పేట రెవెన్యూ భూమిలో కురెళ్లగూడెంలోని 6/1, 6/2 సర్వే నెంబర్లలోని వడ్లపట్లలోని అంజనేయ స్వామి వార్లకు చెందిన ఏడు ఎకరాల భూమిని ఎంఎంపురానికి చెందిన మల్లెం అంజిబాబు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఖరీఫ్ పంటలో కలుపు ఎక్కువగా ఉండడంతో వశిష్ఠ, కార్టెవా కంపెనీకి చెందిన అమైన్ సాల్ట్, నోవీక్సీడ్ కలుపు మందులను భీమడోలులోని లక్ష్మీగణపతి ఫెర్టిలైజర్స్ దుకాణంలో కొనుగోలు చేసి, పిచికారీ చేశాడు. తరువాత రోజు నుంచి పంట ఎండిపోవడంతో గమనించిన రైతు గగ్గోలు పెడుతున్నాడు. ఇప్పటికే రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టానని, నా పరిస్థితి ఏమిటని, తమకు అధికారులు తగు న్యాయం చేయాలని వాపోయారు. కురెళ్లగూడెంలో పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తామని, శాంపిల్ సేకరిస్తామని ఏవో ఉషారాణి తెలిపారు. రైతు ఆందోళన చెందనవసరం లేదని పేర్కొన్నారు.

డ్వాక్రా యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణి

గణపవరం: డ్వాక్రా యానిమేటర్లకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.కల్యాణి డిమాండ్ చేశారు. బుధవారం గణపవరం సీఐటీయూ కార్యాలయంలో గణపవరం మండల డ్వాక్రా యానిమేటర్ల మహాసభ నిర్వహించారు. నూతన యానిమేటర్ల సంఘం అధ్యక్షురాలిగా అడ్డగర్ల సుబ్బలక్ష్మి, కార్యదర్శిగా పైలా నళిని, కోశాధికారిగా తోట పద్మావతి, మరో పదిమంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కె.ఝాన్సీ, మండల కార్యదర్శి పెంటారావు, కె.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారణ సాధ్యం



మాట్లాడుతున్న డా.ఓంకార్‌నాథ్

గణపవరం: క్యాన్సర్ లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమని పీహెచ్‌సీ వైద్యాధికారి ఓంకార్‌నాథ్ అన్నారు. బుధవారం గణపవరం ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మాట్లాడుతూ క్యాన్సర్ వంశ పారంపర్యంగా కాని, జన్యుపరంగా కాని, వృత్తి పరంగా కాని సంక్రమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి విల్సన్‌బాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ



గోడౌన్‌లో సరుకులను పరిశీలిస్తున్న తహసీల్దార్

భీమడోలు: సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు సివిల్ సప్‌లై గోడౌన్‌ను బుధవారం తహసీల్దార్ బి.రమాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో సరుకులను, రికార్డులను ఆమె పరిశీలించారు. బియ్యం బస్తాల స్టాక్, షాపులకు పంపిణీ చేసిన వాటి వివరాలను ఆమె తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీడీఎస్ రైస్ సరుకులు సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ డీటీ స్వర్ణదుర్గ, భరత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు పిచికారీలతో రైతుకు నష్టం

గణపవరం: వరిపైరుపై ముందస్తు పిచికారీలతో రైతులతో పాటు పైరుకు కూడా నష్టమేనని, అవసరమైతేనే పురుగు మందులు వాడాలని వ్యవసాయశాఖ ఏడీఏ గంగాధర్ అన్నారు. బుధవారం గణపవరం మండలం ముప్పర్తిపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

దోమ కాటు ప్రమాదం

దెండులూరు: దోమ కాటు ప్రమాదమని, వాటి నిర్మూలన ప్రజలు భాగస్వామంతోనే సాధ్యమని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. బుధవారం గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శ్రీరామవరం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాలు అధికంగా పడటం వలన వర్షపు నీరు ఎక్కడబడితే అక్కడ నిల్వ ఉండటంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కేత సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌హెచ్‌పీ సుధ, ఏఎస్ఎం స్వరూప ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కోడింగ్‌లో ఉద్యోగావకాశాలు

గణపవరం: ప్రపంచ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో మెడికల్ కోడింగ్ ముఖ్యమైన కెరీర్ మార్గంగా అభివృద్ధి చెందుతుందని, ఈ రంగంలో ఎన్నో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉంటాయని రిసోర్స్ పర్సన్‌లు సబిహా, సుప్రజ అన్నారు. బుధవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తిరుపతికి చెందిన థాట్‌ప్లోస్ సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ కోడింగ్‌పై సైన్సు విద్యార్థులకు ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
90102 23729
Office mail : tpgadvt@gmail.com